క్లుప్తంగా

7 నుంచి శ్రీవిద్యాశక్తి పీఠంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు

తగరపువలస: భీమిలి మండలం రేఖవానిపాలెం పంచాయతీ కీటిన్‌పేటలోని శ్రీవిద్యాశక్తి పీఠంలో ఈ నెల 7, 8 తేదీల్లో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు నిర్వహించనున్నట్టు పీఠం వ్యవస్థాపకుడు సోమయాజుల కల్యాణ చక్రవర్తి శర్మ తెలిపారు. వినాయకుడు, దుర్గాదేవి, రాహువు, కేతువు, నవనాగులు, వారాహి, మానసాదేవి, కాలభైరవ సహిత స్ఫటిక శివలింగాలను ప్రతిష్ఠించనున్నారు. 8న ఉదయం 8.32 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అదే రోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి మహా అన్నసమారాధన నిర్వహించనున్నారు. వివరాలకు 89783 73743, 83283 05636 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

హిందీ పరీక్షల ఫీజు చెల్లింపునకు 26 వరకు గడువు

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచారసభ-చెన్నై ఆధ్వర్యంలో 2025 ఫిబ్రవరి 8,9వ తేదీలలో జరగనున్న హిందీ లోయర్, హయ్యర్ పరీక్షలు సంబంధించి గడువు పెంచినట్టు ఆదర్శహిందీ ప్రేమీ మండలి భీమిలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు. అపరాధ రుసుం లేకుండా ఈ నెల 15 వరకు, రూ.10 అపరాధ రుసుంతో 26 వరకు ఫీజులు చెల్లించవచ్చన్నారు. పరిచయ్, ప్రాథమిక, మాధ్యమిక, రాష్ట్రభాష, ప్రవేశిక, రాష్ట్రభాష విశారద పూర్వార్ధ, రాష్ట్రభాష విశారద ఉత్తరార్ధ, రాష్ట్రభాష ప్రవీణ పూర్వార్ధ, రాష్ట్రభాష ప్రవీణ ఉత్తరార్ధ పరీక్షలు రాయాలనుకునేవారు ఫీజు చెల్లింపు ఉచిత శిక్షణకు 89858 97419, 89856 47419లో సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి మార్గశిరమాస పూజలు

కొమ్మాది: స్థానిక అన్నంరాజునగర్‌లోని శ్రీ అష్ట లక్ష్మి దేవాలయంలో సోమవారం నుంచి మార్గశిర మాస పూజలు ప్రారంభం కానున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధర స్వామి పేర్కొన్నారు. సోమవారం పోలిపాడ్యమితో ప్రారంభమై నాలుగు గురువారాలు మహాలక్ష్మి అమ్మవారికి కుంకుమ పూజలు, ప్రత్యేక అలంకరణలు చేయనున్నట్లు తెలిపారు.

13 తులాల బంగారు ఆభరణాల చోరీ

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు పంచాయతీ కేవీఆర్ సిటీ లే అవుట్‌లో ఉంటున్న జి.సుగుణ ఇంట్లో 13 తులాల బంగారు ఆభరణాలు, నగదు చోరీకి గురయ్యాయి. ఈ మేరకు బాధిత కుటుంబ సభ్యులు శనివారం భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుగుణ బయటకు వెళ్లగా ఆమె భర్త తగరపువలసలోని షోరూమ్‌కు వెళ్లిపోయారు. వీరిరువురు బయటకు వెళ్లినప్పుడు ఇంటి తాళాలు ఇంటి వద్దే తమకు తెలిసిన ప్రదేశంలో ఉంచుతారు. శనివారం బాధిత కుటుంబ సభ్యులు బయట నుంచి ఇంటికి వచ్చి చూసేసరికి పెట్టిన తాళాలు పెట్టినచోటే ఉండగా ఇంట్లోని కప్‌బోర్డులో బంగారు ఆభరణాలు, నగదు మాయమయ్యాయి. ఎక్కడా తాళాలు విరగ్గొట్టిన ఆనవాళ్లు లేవు. ఈ లే అవుట్‌లో మూడు నిర్మాణాలు మాత్రమే ఉండటంతో పెద్దగా జనసంచారం ఉండదు. దీంతో బాగా తెలిసిన వారే తాళాలు తెరచి ఇంట్లో చోరీకి పాల్పడినట్టు పోలీసులు భావిస్తున్నారు. మధురవాడ క్రైమ్ సీఐ సూర్యప్రకాష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నూతన కార్యవర్గం ఎంపిక

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీఆర్ఎస్ఏ) భీమిలి డివిజన్ ఎన్నికలు ఆదివారం కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ఉన్న రెవెన్యూ భవన్‌లో నిర్వహించారు. 2024 నుంచి 2027 వరకు ఉండే నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎల్.చేతన్ కుమార్ (డీటీ, ఆనందపురం మండలం), అసోసియేట్ అధ్యక్షుడిగా కె.సుధాకర్ (డీటీ, ఆర్‌డీవో ఆఫీసు భీమిలి), ఉపాధ్యక్షులుగా ఎ.వెంకటేష్ (సీనియర్ అసిస్టెంట్, ఆర్‌డీవో, భీమిలి), ఎల్.లోకేష్ (టైపిస్టు, ఆనందపురం తహసీల్దార్ ఆఫీసు), డి.శ్యామల (ఆర్ఐ, పద్మనాభం తహసీల్దార్ ఆఫీసు), కార్యదర్శిగా సీహెచ్ రవి కృష్ణ (డీటీ, పద్మనాభం తహసీల్దార్ ఆఫీసు), సంయుక్త కార్యదర్శులుగా టి.మల్లేశ్వరరావు (ఆర్ఐ, భీమిలి తహసీల్దార్ ఆఫీసు), ఏవీ కిషోర్ (ఆర్ఐ, విశాఖ రూరల్ తహసీల్దార్), ఎండీ ముస్తఫా(ఆనందపురం తహసీల్దార్ ఆఫీసు), కోశాధికారిగా ఎస్.కె.ఇబ్రహీం (సీనియర్ అసిస్టెంట్, సీతమ్మధార), ఈసీ సభ్యులుగా టి.రామచంద్, పి.జ్ఞానదీప్ ఎన్నికయ్యారు.

రోడ్డు విస్తరణకు నిర్లక్ష్య గ్రహణం

- ఇరుకు రోడ్డుతో ప్రయాణికుల అవస్థలు
- రెండున్నరేళ్లయినా ముందుకు సాగని పనులు



కోరాడ వద్ద గోతులు పడిన రోడ్డు



రేవిడి వద్ద ఇరుగ్గా ఉన్న రోడ్డు



బొత్సపేట వద్ద ఇరుకుగా ఉన్న రోడ్డు

పద్మనాభం: మండలంలోని రేవిడి-ఐనాడ ఎన్‌హెచ్-46 రోడ్డు అటు విస్తరణకు ఇటు మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో ఈ రోడ్డుపై రాకపోకలు సాగించడానికి ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. రేవిడి ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి ఐనాడ జంక్షన్ వరకు 12 కిలోమీటర్ల గల రోడ్డు అత్యంత ఇరుకుగా ఉంది. 12 అడుగుల వెడల్పు ఉన్న ఈ రోడ్డును 40 అడుగులకు విస్తరించడంతో పాటు రోడ్డు అభివృద్ధి చేయడానికి సీఆర్ఐఎఫ్ నిధులు రూ.16 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో 2022 ఫిబ్రవరిలో రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారు. లింగన్నపేట, వెంకటాపురం, లింగన్నపేట, వెంటాపురం సమీపంలో మూడు పైపు కల్వర్టులు నిర్మించారు. కల్వర్టుల నిర్మాణం వరకే పనులు పరిమితం చేశారు. తరవాత ఇంచి కూడా పనులు ముందుకు వెళ్లలేదు. బి.ఆర్.తాళ్లవలస వద్ద కల్వర్టు నిర్మాణానికి సిమెంటు పైపులు తీసుకువచ్చి పొలాల్లో గాలికి వదిలేశారు. పనులు ప్రారంభించి రెండేన్నరేళ్లు దాటిపోతున్నా పురోగతి లేదు. ఈ రోడ్డుపై రేవిడి, వెంకటాపురం, కోరాడ, లింగన్నపేట, బొత్సపేట, బి.ఆర్.తాళ్లవలస, ఐనాడ, విజయనగరం ప్రాంతాలకు లారీలు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు తిరుగుతూ ఉంటాయి. రోడ్డు ఇరుకుగా ఉండడంతో లారీల వంటి భారీ వాహనాలు ఎదురుగా వచ్చేటప్పుడు ఆటోలు, ద్విచక్ర వాహనాలు తప్పుకోలేని పరిస్థితి. దీనికి తోడు రోడ్డు మొత్తం గోతులు పడడంతో ద్విచక్ర వాహనదారులు గోతుల్లో ప్రమాదాలకు గురవుతున్నారు.



బి.ఆర్.తాళ్లవలసలో పొలాల్లో వదిలేసిన పైపులు

రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి



రేవిడి-ఐనాడ రోడ్డు విస్తరణ పనులను తక్షణమే చేపట్టాలి. రెండున్నరేళ్లు అయిన పనులు పూర్తి కాలేదు. రోడ్డు ఇరుకుగా ఉండడంతో భారీ వాహనాలు ఎదురుగా వచ్చేటప్పుడు ద్విచక్ర వాహనాలు, ఆటోలు తప్పించుకోలేని పరిస్థితి ఉంది.

– టి.నారాయణమూర్తి, కోరాడ

ప్రయాణం నరకం



రోడ్డు మొత్తం గోతులు పడింది. దీని వల్ల రాక పోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డుపై రాళ్లు తేలిపోయాయి. ద్విచక్ర వాహన చోదకులు గోతుల్లో పడి ప్రమాదాల పాలవుతున్నారు. రాళ్లు తేలిపోవడంతో అవస్థలు పడుతున్నాం.

– కె.అప్పలనాయుడు, లింగన్నపేట

త్వరలో పనులు

రేవిడి-ఐనాడ రోడ్డు విస్తరణ పనులను త్వరలో చేపడతాం. సాధ్యమైనంత త్వరగా విస్తరణ, అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటాం.

– గంగరాజు, ఆర్‌అండ్‌బీ డీఈఈ

ఇస్కాన్ మందిరంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరం ఆదివారం హరేరామ హరేకృష్ణ, కృష్ణకృష్ణ రామరామ అంటూ నామస్మరణతో మార్మోగింది. వారాంతపు పూజా కార్యక్రమంలో భాగంగా రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపనలు చేశారు. రాధాకృష్ణులను వందలాది మంది భక్తులు దర్శించుకున్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం రేపు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబరేటరీ సామాజిక బాధ్యతా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనుంది. చిప్పాడ సుత్తమ్మ ఆలయం వద్ద ఉదయం 9 గంటల నుంచి నగరానికి చెందిన ఎల్.వి ప్రసాద్ నేత్ర వైద్య సంస్థచే ఈ పరీక్షలు నిర్వహిస్తారు. అవసరమైన వారికి కళ్లజోడు ఉచితంగా ఇవ్వనున్నారు. ఈ సేవలు వినియోగించుకోవాలనుకునేవారు ఆధార్‌కార్డుతో పాటు కంటికి సంబంధించిన రిపోర్టులు తీసుకుని రావాలని నిర్వాహకులు సూచించారు.

ముందస్తు అవగాహనతో హెచ్ఐవీ నియంత్రణ



హెచ్ఐవీపై విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీవాణి



రెడ్ రిబ్బన్ నమూనాలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు



ర్యాలీలో పాల్గొన్న వెంకటరాజు తదితరులు

తగరపువలస : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం ప్రిన్సిపాల్ పి.శ్రీవాణి ఆధ్వర్యంలో విద్యార్థులకు హెచ్ఐవీపై అవగాహన కల్పించారు. ముందుగా విద్యార్థులు హెచ్ఐవీపై అవగాహన కలిగిస్తూ ర్యాలీ నిర్వహించి రెడ్ రిబ్బన్ నమూనాలో ప్రదర్శన ఇచ్చారు. అనంతరం ప్రిన్సిపాల్ శ్రీవాణి మాట్లాడుతూ హెచ్ఐవీ ప్రాణాంతకమైన వ్యాధి అయినప్పటికీ ముందస్తు అవగాహన, పరీక్షల వలన తీవ్రతను, వ్యాధిని నియంత్రించవచ్చన్నారు. కలుషిత సిరంజిలు, రక్తం తదితర కారణాలతో వ్యాధి ఒకరి నుంచి మరొకరికి సంక్రమిస్తుందన్నారు. వ్యాధిగ్రస్తులపై వివక్షత చూపకుండా ఆదరించాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, రెడ్ రిబ్బన్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అప్రమత్తంగా ఉండాలి

భీమునిపట్నం: ఎయిడ్స్ వ్యాధి ప్రాణాంతకమైనదని దాని విషయంలో అందరూ ఎంతో అప్రమత్తంగా ఉండాలని హెచ్ఐవీకి సంబంధించిన సమీకృత సలహా, పరీక్ష కేంద్రం కౌన్సిలర్ రావి వెంకటరాజు అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఆదివారం కళాశాల విద్యార్థులతో నిర్వహించిన ర్యాలిలో పాల్గొన్నారు. ఎయిడ్స్ సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆస్పత్రి ప్రధాన వైద్యులు ఫణి కుమార్, ల్యాబ్ టెక్నీషియన్లు జయలక్ష్మి, మాధరావు పాల్గొన్నారు.

నాలుగు గ్రామాల్లో ర్యాలీ

పద్మనాభం: మండలంలోని నాలుగు గ్రామాల్లో ఆదివారం ఎయిడ్స్‌పై స్వయం సహాయక సంఘాల సభ్యులు అవగాహన ర్యాలీలు నిర్వహించారు. కోరాడ, వెంకటాపురం, రేవిడి, కురపల్లి గ్రామాల్లో ఈ ర్యాలీలు నిర్వహించారు. సురక్షితమైన లైంగిక సంబంధాలు కలిగి ఉంటే ఎయిడ్స్‌కు దూరంగా ఉండొచ్చన్నారు. హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులు ఏఆర్‌టీ ఎం మందులు వాడడం ద్వారా సాధారణ వ్యాధిగ్రస్తుల్లా జీవించగలరన్నారు. ర్యాలీలో ఎస్‌వోఎస్ ప్రతినిధి కె.దుర్గరాజు, యానిమేటర్లు జానకి, మణి, ఆది లక్ష్మి, సత్యనారాయణ పాల్గొన్నారు.



రేవిడిలో అవగాహన ర్యాలీ

బోసిపోయిన పర్యాటక ప్రాంతాలు



వెలవెలబోతున్న రుషికొండ బీచ్



తీరానికి పరిమితమైన వలలు, బోట్లు

కొమ్మాది: కార్తీకమాసం నేపథ్యంలో నాలుగు వారాల నుంచి పర్యాటక ప్రాంతాలన్నీ పర్యాటకులతో కిటకిటలాడాయి. అయితే తుపాను నేపథ్యంలో వర్షాలు ఓ వైపు, ఈదురు గాలులు మరో వైపు వీస్తుండడంతో ప్రముఖ పర్యాటక ప్రాంతాలన్నీ ఆదివారం బోసిపోయాయి. ఎప్పుడు పర్యాటకులతో కిటకిటలాడే భీమిలి బీచ్, రుషికొండ బీచ్, రామానాయుడు ఫిల్మ్ స్టూడియో వంటి ప్రాంతాలు ఆదివారం బోసిపోయాయి. మరోవైపు మత్స్యకారులు వేటకు విరామం ప్రకటించారు. వారం రోజుల నుంచి మత్స్యకారులు వేటకు వెళ్లకపోవడంతో వలలు, బోట్లు తీరానికే పరిమితమయ్యాయి.

ముగిసిన ఎన్ఎంఎంఎస్ శిక్షణ తరగతులు



శిక్షణకు హాజరైన విద్యార్థులు

తగరపువలస : చిట్టివలస జెడ్పీహైస్కూల్‌లో ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఆరునెలల పాటు సాగిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి వివిధ పాఠశాలలకు చెందిన నిష్ణాతులైన ఉపాధ్యాయులు సెలవురోజుల్లో ఈ ఉచిత శిక్షణ అందించారు. పరీక్ష విజయవంతానికి సూచనలు చేశారు. పలు స్వచ్ఛంద సంస్థలు విద్యార్థులకు అల్పాహారం అందించారు. ఈ నెల 8న ఎన్ఎంఎంఎస్ పరీక్ష జరగనుంది. ఈ ముగింపు శిక్షణ కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు గంటాన మోహనరావు, ప్రధాన కార్యదర్శి రేక అప్పారావు, ఉపాధ్యాయుడు గొట్టిపల్లి సత్యనారాయణ, గొండు చిన్నయ్య, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన లక్ష దీపోత్సవం



శ్రీనివాస గోవిందుడు, దామోదర కృష్ణునికి నేతిదీపంతో నీరాజనం



హారతి ఇస్తున్న హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధులు

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రహదారిలో హరేకృష్ణ వైకుంఠం వద్ద హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో ఐదు రోజులుగా శ్రీవైకుంఠ శ్రీనివాసునికి, శ్రీ దామోదర కృష్ణునికి నిర్వహిస్తున్న లక్ష దీపోత్సవం ఆదివారంతో వైభవంగా ముగిసింది. నిర్వాహకులు గోవిందునికి, దామోదర కృష్ణునికి, భక్తి వేదాంత స్వామి ప్రభు పాదుల వారికి వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. చివరి రోజు దీపాల వెలుగులు, సంగీత వాయిద్యాల నడుమ భక్తులు భగవంతుని సేవలో నాట్యం చేస్తూ తన్మయులయ్యారు. తులసి హారతి, తులసి మహారాణికి పూజలు నిర్వహించి ఆమె చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కామిరెడ్డి సత్యనారాయణచే ఆకాశదీపం, కృతిచే తొలి నేతి దీపం ఆవిష్కరించారు. దామోదర అష్టకం పఠించారు. వివిధ ఆకృతులలో భక్తులు దీపాలు వెలిగించారు. మూవ్‌మెంట్ అధ్యక్షుడు నిష్కించిన భక్తదాస భక్తులను ఉద్దేశించి ప్రవచించారు. యుగాలన్నింటిలో సత్యయుగం, శాస్త్రాలలో వేదం, నదులలో గంగ, మాసాలలో కార్తీకం ఉత్తమమైనవన్నారు. కార్తీకవ్రతం ఆచరిస్తే అనేక పుణ్యనదులలో స్నానం, సంపద దానం చేస్తే వచ్చే ఫలితం కంటే కోటి రెట్లు ఫలితం ఉంటుందన్నారు. యోగులు, సాధువులు వేల సంవత్సరాలు కఠిన తపస్సు చేసినా సాక్షాత్కరించని కృష్ణుడు 5వేల ఏళ్ల క్రితమే యశోద భక్తికి లొంగిపోయి అనుగ్రహించాడన్నారు. చివరగా భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు అరికట్టాలని భక్తులు ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అంబరీష దాస తదితరులు పాల్గొన్నారు.



బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలని ప్లకార్డులు ప్రదర్శిస్తున్న భక్తులు

నిఘా నేత్రం.. అలంకారప్రాయం



నిత్యం రద్దీగా ఉంటే మధురవాడ ప్రాంతంలో సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. ప్రధాన జంక్షన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు అలంకారప్రాయంగా నిలుస్తున్నాయి. సీసీ కెమెరాలు వినియోగంలోకి తీసుకురావాలని పదేపదే పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి చెబుతున్నప్పటికీ జీవీఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు సీసీ కెమెరాలు వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. – మధురవాడ

మంచి రచనలతో సమాజానికి మేలు



పలు పుస్తకాలను ఆవిష్కరిస్తున్న సభ్యులు

భీమునిపట్నం: సమాజానికి మేలు జరగాలంటే మంచి రచనలు రావాలని అటువంటి రచనలను అందించే బాధ్యత అందరిపైనా ఉందని రచయిత, కళాసాహితి అధ్యక్షుడు పొత్తూరు రాజేంద్రప్రసాద్ వర్మ అన్నారు. ఆదివారం కళాసాహితి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన రచయితలు, కవుల సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొన్నారు. మంచి విషయాలపై ప్రజలను ప్రభావితం చేసే రచనలు రావడం ద్వారా ఎంతో మేలు జరిగే అవకాశం ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పుస్తకాలు చదవడం తగ్గిపోయినప్పటికి వాటిని చదివే వర్గం ఉందని వారికి దృష్టిలో పెట్టుకుని చక్కని రచనలు రావాలన్నారు. ఇటువంటి సమ్మేళనాల వల్ల రచయితలు తమ రచనలు, కవిత్వాల గురించి తెలియపరిచే అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరు తమ రచనలు వాటి వివరాలను వివరించారు. అలాగే రచయితలు తాము రాసిన పుస్తకాలను అందరి సమక్షంలో ఆవిష్కరించారు. పోలిపల్లి శ్రీనివాసరావు రచించిన పోలిపల్లి మాట.. పూలబాట, కె.రామ్మోహనరావు రచించిన ఎదురులేని ఏడు, డాక్టర్ ఎం.సుగుణరావు రచించిన ఫైనల్ డయగ్నోసిస్, లక్ష్మీ గాయత్రి రచించిన పెళ్లి పుస్తకాలను ఆవిష్కరించారు. కళా సాహితి గౌరవాధ్యక్షులు రేలంగి పెదబాబు, కార్యదర్శి అడిదం సన్యాసిరావు, కోశాధికారి కాళ్ల సన్నీ, సభ్యులు మునుసూరి సూర్య శ్రీనివాస్, అడిదం కిశోర్, కోటయ్య, మైలిపల్లి లక్ష్మణరావు పాల్గొన్నారు.

20 మద్యం సీసాల స్వాధీనం

తగరపువలస: ఆనందపురం మండలం భీమన్నదొరపాలెం పంచాయతీలో ఆదివారం ఆనందపురం ఎస్ఐ జి.సంతోష్, సిబ్బంది కలిసి ఈశ్వరరావు అనే వ్యక్తి నుంచి 20 క్వార్టర్ల మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. సదరు నిందితుడు బాటిళ్లు కలిగిన బ్యాగుతో పారిపోతుండగా అదుపులోకి తీసుకున్నారు. తాను వ్యవసాయదారుడినని వ్యవసాయం ద్వారా వచ్చే ఆదాయం సరిపోక వివిధ మద్యం దుకాణాల వద్ద బాటిళ్లు కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్టు తెలిపారు. సీఐ వాసునాయుడు సూచనలతో ఎస్ఐ సంతోష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.